క్లుప్తంగా

పేద మహిళకు బండి వితరణ



సత్తెనపల్లి: మిత్రుల సహాయ సహకారాలతో కలాం చేయూతలో భాగంగా వాసవి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వెలుగూరి శరత్ నేతృత్వంలో పట్టణంలోని 21వ వార్డుకు చెందిన పేద మహిళ పుట్ట సామ్రాజ్యంకు నాలుగు చక్రాల ట్రైర్ల బండిని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం పంపిణీ చేశారు. కలాం చేయూత పేరుతో సేవా కార్యక్రమాలు చేపడుతున్న శరత్‌ను అభినందించారు. కార్య క్రమంలో ఏపీపీ బగ్గి నరసింహారావు, కౌన్సిలర్ కాకుమాను రవి, నాయకులు షేక్ జానీ(గుంటూరు మేస్త్రి), సహారా మౌలాలి, షేక్ మహిబుల్లా, శిరిగిరి వెంకట్రావు, కోడిరెక్క దేవదాసు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ ఉపసర్పంచ్ పదవికి రాజీనామా

ముప్పాళ్ళ: ముప్పాళ్ళ గ్రామ ఉపసర్పంచ్ పదవికి షేక్‌మస్తానీ బుధవారం రాజీనామా చేశారు. ఆ మేర రాజీనామా పత్రాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా ఈఓపీఆర్డీ రూపవతి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావులకు అందించారు. 2021లో జరిగిన ఎన్నికల్లో ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆమె తెలిపారు. వ్యక్తిగత కారణాల చేత ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు. 1వార్డు సభ్యురాలిగా కొనసాగుతానని ఆమె తెలిపారు. తన రాజీనామా ను ఆమోదించాలని ఆమె కోరారు. ఆ మేరకు సర్పంచ్ మెడబలిమి సతీష్‌కు రాజీనామా పత్రాన్ని అందించారు.

అందరికీ చట్టాలపై అవగాహన అవసరం



సత్తెనపల్లి: అందరికీ చట్టాలపై అవగాహన అవసరం ఎంతైనా ఉందని లీగల్ సెల్ కమిటీ మెంబర్, సామాజిక కార్యకర్త వెలుగూరి సుబ్బారాయుడు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ బి.నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు స్థానిక సుగాలి కాలనీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతుల వారికి చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని మాట్లాడుతూ సమాజంలో అందరూ తమ హక్కులను, విధులను గుర్తెరిగి నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావ, పారా లీగల్ వాలంటీర్ షేక్ ఖాజా వలి, మహిళా పోలీస్ విజయలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

అనంతవరంలో ఫ్యామిలీ డాక్టర్



అనంతవరం(క్రోసూరు): మండలంలోని అనంతవరం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణదీప్తి , వైద్యసిబ్బంది పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. అదేవిధంగా గ్రామంలో ఇళ్లవద్ద ఉన్న రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందచేయడం జరిగింది. 61 మంది రోగులకు వైద్యపరీక్షలు చేయడం జరిగింది.

గ్యాస్ సిలిండర్ లీక్‌తో మంటలు చేలరేగి వ్యక్తి మృతి



పెదకూరపాడు: ఇంట్లో వంట గ్యాస్ లీక్ అయి వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకూరపాడులోని బీసీ కాలనీ రహదారిలో చోటు చేసుకుంది. పెదకూరపాడు ఎస్ఐ సత్యనారయణ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున గ్రామానికి చెందిన గొంగటి యేసురత్నం (60) టీ కాచుకునేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించగా ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెంది తీవ్రంగా గాయాలపాలయ్యారు. దీంతో మంటలో కాలిపోయిన యేసురత్నాన్ని కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు.

నిత్యావసరాలు పంపిణీ

నరసరావుపేట: పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు దానం చేయడం ఎంతో పుణ్య కార్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పట్టణంలోని ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇస్లాంపేట షేక్ షరీపుద్దీన్ కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.

సంక్షేమ, సుపరిపాలనకు ప్రజల అండ

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన
- ముందు వరసలో ఉంది.. జిల్లాలో సత్తెనపల్లి నియోజకవర్గం
- మంత్రి అంబటి రాంబాబు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: 'జగనన్నే మా భవిష్యత్తు .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని , తాను ప్రత్యక్షంగా గమనించానని, గతంలో జరిగిన అన్ని కార్యక్రమాలు కన్నా ఇది చాలా ప్రతిష్టాత్మకమైనదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం 'జగనన్నే మా భవిష్యత్తు .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమ సమీక్షలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ కౌన్సిలర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు ఇతర నాయకులు బాధ్యతగా తీసుకొని ఈ నెల18 లోగా ఇంటింటికీ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని చిత్త శుద్ధి తో నిర్వహిస్తూ వేగంగా లక్ష్యాన్ని పూర్తి చేస్తున్న కౌన్సిలర్లను ప్రశంసించారు. ఈ సమీక్షలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కన్వీనర్ షేక్ నాగూర్ మీరాన్, వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరావు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబు రావు, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, డాక్టర్ మక్కెన అచ్చయ్య ,జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు కొనతం స్వాతి, పులిబండ్ల అశోక్, మేడం ప్రవీణ్ రెడ్డి ,బొంతు వెంకటేశ్వర్ రెడ్డి, చిలుకా జయపాల్, కోడిరెక్క దేవదాసు, షేక్ మౌలాలి, యూనస్, స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.

జన నినాదం 'జగనన్నే మా భవిషత్'

సత్తెనపల్లి: 'జగనన్నే మా భవిష్యత్తు .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగుతుంది. ఏ నోట విన్నా జన నినాదం జగనన్నే మా భవిష్యత్తు అని వినిపిస్తోంది. పట్టణం , పల్లె అని తేడా లేకుండా ఏ ఒక్కరిని కదిలించిన మళ్లీ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుతున్నారు.

సత్తెనపల్లి పట్టణంలో....

'జగనన్నే మా భవిష్యత్. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం పట్టణంలోని 31 వార్డుల్లో బుధవారం సాగింది. వార్డు కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జ్‌ల నేతృత్వంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. నాటి టీడీపీ పాలనకు – నేటి వైఎస్ఆర్ సీపీ పాలనకు వ్యత్యాసాన్ని ప్రస్తావించగా లబ్దిదారులు స్పందిస్తూ వైఎస్ఆర్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ళుగా అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నారని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా రోజుల తరబడి తిప్పకుండా పనులు చేస్తున్నారని, ఒకటో తేదీ తెల్లవారక ముందే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్లు అందిస్తున్నారని చెప్పారు. ఇలాంటి మేలు చేసే ప్రభుత్వాన్ని తప్పని సరిగా ఆదరిస్తామని, మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలను సంధించి సమాధానాలు రాబట్టారు. లబ్ధిదారుల ఇష్టం మేరకు వారి ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అంటించి పోస్టర్లను పంపిణీ చేశారు. వారి సెల్ ఫోన్ నుంచి : 82960 82960 నంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్ఆర్ సీపీ పల్నాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, జెసీఎస్ ఇన్‌చార్జ్ కొనతం స్వాతి, వార్డు కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు ఉన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: మా నమ్మకం నువ్వే నయ్యా అంటూ అన్ని వర్గాల ప్రజలు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వారికి జరిగిన మేలును తలుచుకోని ముఖ్యమంత్రి ముఖచిత్రంతో ఉన్న స్టిక్కర్లుకు దండంపెడుతున్నారు. పెదకూరపాడులోని ఆనందపేటలో బుధవారం సాయంత్రం ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మండల పార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్ షరీప్, జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి, గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు మా నమ్మకం నువ్వే జనగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందపేట వాసులు స్వచ్ఛందంగా వచ్చి మా ఇంటికి రండి అంటూ ఆహ్వానం పలికి జగనన్న ప్రభుత్వంలో తమ కుటుంబానికి జరిగిన మేలులను తెలియజేశారు.

సత్తెనపల్లి మండలంలో....

'జగనన్నే మా భవిష్యత్ .. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం సత్తెనపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం జరిగింది. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్ల ప్రజలు తమ నమ్మకాన్ని వెలిబుచ్చారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ సందర్శించగా లబ్ధిదారులు స్పందించి సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, వలంటీర్లు తమ ఇంటికి వచ్చి పింఛన్లు అందిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా ప్రజా మద్దతు పుస్తకంలో ఉన్న ఐదు ప్రశ్నలను లబ్ధిదారులను అడిగి సమాధానాలు రాబట్టారు. లబ్ధిదారుల ఇష్టం మేరకు తలుపులకు, గోడలకు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అంటించారు. వారి సెల్ ఫోన్ నుంచి 82960 82960 నంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ వైఎస్ఆర్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, జెసీఎస్ ఇన్‌చార్జ్ బొంతు వెంకటరెడ్డి, ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఉన్నారు.



24వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్

క్రోసూరు: క్రోసూరులోని ఎస్సీకాలనీలో జగనన్నే మా భవిషత్తు కార్యక్రమాన్ని బుధవారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని నిర్వహించారు. ఇంటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాల వివరాలు తెలియజేశారు. జగనన్నను మరాలా ఆశీర్వదించాలని కోరారు. జగనన్న అందజేసిన సంక్షేమ ఫలాలు దేశచరిత్రలో ఎవరూ అందజేయలేదని తెలిపారు. కార్యక్రమలో గృహసారథులు చిల్కామరియకుమారి, పందిటి వీరయ్య, పవన్, రవికుమార్, దాసయ్య, దుగ్గి ఏడుకొండలు పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జనగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య

నకరికల్లులో....

నకరికల్లు: గ్రామగ్రామాన జగన్నినాదం మార్మోగుతుందని జేసీఎస్ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్నిగ్రామాల్లోను జగనన్న నువ్వే మా భవిష్యత్తు, జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. గోడలకు, ఫోన్లకు స్టిక్కర్ అంటించి: 8296082960 నంబర్‌కు మిస్‌డ్‌కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల నాయకులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో 'జగనన్నే మా భవిష్యత్'

రాజుపాలెం: అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీతాశ్రీనివాసరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రాజుపాలెంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పులిబండ్ల అశోక్‌లు పాల్గొని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామ సచివాలయాల కన్వీనర్‌లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటిల్లో జగనన్న అందిస్తున్న సంక్షేమాల గురించి ఆరాతీశారు. అనంతరం స్టిక్కరును ఇంటి తలుపుకు అంటించి ఫోన్‌తో మాట్లాడించారు. కార్యక్రమంలో జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, ఆర్‌బీకే సలహామండలి చైర్మన్ కేదారి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సునీతా శ్రీనివాసరెడ్డి

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని రుద్రవరం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు చొరవతో రెడ్‌క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు, సత్తెనపల్లి కమిటీ సభ్యులు సంయుక్తంగా వంటపాత్రలు, టార్పాలిన్‌పట్టలు, హైజిన్ కిట్స్ బుధవారం అందించారు. బాధితులను పరామర్శించి వారికి అవసరమైన నిత్యావసర సామాగ్రిని అందించారు. జిల్లా రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్, కలెక్టర్ లోతేటిశివశంకర్ ఆదేశాల మేర రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డా.కంజుల జగన్మోహనరెడ్డి, తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, రెడ్‌క్రాస్ సభ్యులు బత్తులమురళి, కె.ఎం.యస్.వి. శ్రీనివాసగుప్తా, ఆంజనేయులు, మేనేజింగ్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, డి.కోటేశ్వరరావు, కె.శ్రీరత్నం, ఎస్.భుజంగరావు, సత్తెనపల్లి సబ్‌బ్రాంచ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బాధితులకు సాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, తహసీల్దార్ భవానిశంకర్

కుక్కను తప్పించబోయి పల్టీ కొట్టిన కారు

- ముగ్గురికి స్వల్పగాయాలు
- క్షతగాత్రుల్లో నెల్లూరు టీచర్ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి మామ

యడ్లపాడు: రాష్ట్ర శాసనమండలి ప్రాంగణంలో బుధవారం జరిగిన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం వేడుకల్లో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన కారు బోల్తా పడింది. నెల్లూరు జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మామ మల్లారెడ్డి మరోఇద్దరు ఉన్న కారు పల్నాడు జిల్లా యడ్లపాడు నక్కవాగు సమీపంలోకి రాగానే అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి కారు అదుపు తప్పి ఎక్స్‌ప్రెస్ హైవేపై నుంచి పల్టీలు కొడుతూ ఆరడుగులు కిందకు ఉన్న సర్వీసు మార్గంలోకి వెళ్లి పడింది. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగిన ఈ ప్రమాదంలో మల్లారెడ్డితో పాటు కారులోని మిగిలిన ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనం సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని చిలకలూరిపేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

26లోగా 'వాత్సల్య'కు దరఖాస్తు చేసుకోండి

శావల్యాపురం: మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్ పథకానికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరణ ఈనెల 26 లోగా తుదిగడువు అని సీడీపీఓ ముదివర్తి అనురాధ బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీఓ అనురాధ మాట్లాడుతూ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో 18 సంవత్సరాల లోపు అనాథలైన బాల బాలికలు, తండ్రిని కోల్పోయిన వారందరూ వితంతువు, విడాకులు తీసుకున్న వారు, కుటుంబం వదిలివేసిన తల్లి పిల్లలు, ప్రాణాంతకర వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, ఆర్థికంగా శారీరకంగా పిల్లలను పెంచలేని నిస్సహాయులు అర్హత పొందుతారన్నారు. ఈపథకం కేంద్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం రూ.72వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు ఆదాయం కల్గియున్న వారు అర్హత పొందుతారన్నారు. అర్హత పొందిన పిల్లలకు ప్రతి నెల రూ. 4వేలు చొప్పున ఆర్థిక చేయూత ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

యడ్లపాడు: వివాహిత అదృశ్యమైన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపురం ఎస్సీకాలనీకు చెందిన యేసు మరియమ్మకు రెంటపాళ్లకు చెందిన బత్తుల బాబూరావుతో పది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి సంతానం లేకపోవడంతో మరియమ్మను బాబూరావు వేధింపులు గురిచేయసాగాడు. దీంతో మరియమ్మ పుట్టిల్లు తిమ్మాపురం వచ్చింది. ఈస్టర్ పండుగనాడు భర్త బాబూరావు వచ్చి తీసుకువెళ్తానన్నా తిరిగి వెళ్లలేదు. ఈనెల 9వ తేదీన రాత్రి తల్లి నిద్రిస్తుండగా మరియమ్మ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. అల్లుడు బాబూరావుకు ఫోన్‌చేసినా అక్కడకు రాలేదంటూ సమాధానం చెప్పడంతో బంధువులను ఆరా తీశారు. ఎక్కడా కూతురి ఆచూకీ లభించపోవడంతో తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన పోలేరమ్మ తిరునాళ్ల

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవత పోలేరమ్మ తల్లి దేవాలయ వార్షిక తిరునాళ్ల మహోత్సవం బుధవారం తెల్లవారుజాముతో ముగిశాయి. గత మూడు రోజులుగా ఆలయంలో చండీహోమం, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకాలు, లక్ష మల్లెలతో అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం తీన్‌మార్ వాయిద్యాలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కుంకుమపూజలు, పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది. ఆయా ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

ముప్పాళ్ళ: విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడడం వల్ల, సేంద్రియ ఎరువుల వాడడం తగ్గిపోవడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని పలు రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎమ్.శివకుమారి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం రైతుభరోసా కేంద్రంలో నేల ఆరోగ్య పరిరక్షణ మరియు మట్టిన మూనాల సేకరణపై గ్రామవ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న శివకుమారి మాట్లాడుతూ రసాయనాల వాడకం వల్ల నేల చౌడు బారుతుందన్నారు. ఉప్పు నేలగా మారే ప్రమాదం ఉంటుందని చెప్పారు. పరిష్కారంగా భూసార పరీక్ష చేయించుకుని అవసరాన్ని బట్టి ఎరువులను వాడుకుని తద్వారా ఎరువులపై పెట్టే ఖర్చు తగ్గించుకోవాలని, సూక్ష్మపోషక లోపాలు సవరించుకుని దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. మన నేలలో సేంద్రియ పదార్థాలు చాలా తక్కువగా ఉన్నాయని, పశువుల, కోళ్ళ ఎరువు, గొర్రెల మేకల మంద కట్టడం, పచ్చిరొట్ట ఎరువు వాడకం వంటివి చేపట్టాలని సూచించారు. కార్యక్రమం అనంతరం క్షేత్రస్థాయిలో మట్టినమూనాలు తీసే విధానం పై అవగాహన కల్పించారు. సమస్యాత్మక నేలలు బాగు చేయడం గురించి, జిప్సం వాడే విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎమ్.అరుణ, ఆయా గ్రామాల వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.



మట్టినమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి

యువత సన్మార్గంలో పయనించాలి

సత్తెనపల్లి: యువత చెడు మార్గాల వైపు పయనించకుండా మంచి మార్గంలో ముందుకు వెళ్లాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకు బాలచంద్ర స్వామీజీ అన్నారు. పట్టణం లోని సాయి గాయత్రి ధ్యాన మందిరం ప్రాంగణంలో హైదరాబాద్ అభయ ఫౌండేషన్ వారి సహకారంతో జన చైతన్య సమితి (పెదకూరపాడు)ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శ్రీభవాని డ్రైవింగ్ స్కూలు ద్వారా ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణకు లబ్ధిదారుల ఎంపికను బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా బాలచంద్ర స్వామీజీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో అర్హులైన పేద యువత, మహిళల అభ్యున్నతి కోసం అభయ ఫౌండేషన్ ఎన్నో నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, అందులో భాగంగా జన చైతన్య సమితితో కలసి సత్తెనపల్లి కేంద్రంగా ఉచిత డ్రైవింగ్ శిక్షణను ఏర్పాటు చేశామన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో డ్రైవింగ్ లో మంచి నైపుణ్యం సంపాదిస్తే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జన చైతన్య సమితి నిర్వాహకులు దాసరి విజయ్ బెన్నిబాబు, కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు, కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, కట్టమూరు. వెంకటేశ్వర్లు (సాయిరాం), లెర్నర్ దొంతు.రాజేశ్వరరావు, శివ ప్రకాష్, విజయ భాస్కర్ ఉన్నారు.



మాట్లాడుతున్న అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచంద్ర స్వామిజీ

పీహెచ్‌సీలో ఎన్‌కాస్ బృందం తనిఖీలు

ముప్పాళ్ళ: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై జాతీయ నాణ్యతా ప్రమాణం సూచి సర్వే(ఎన్‌కాస్) బృందం ప్రతినిధులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. నాణ్యతా ప్రమాణం అంచనా కేంద్ర బృందం ప్రతినిధులు డా.కె.ఏ.జితీష్, డా.కవిత లు ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి లాబోరేటరీ, ఫార్మశీ, వార్డు, లాబర్‌రూమ్ లను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారం రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ముందుగా నూతనంగా ఏర్పాటు చేసిన మాతాశిశు విగ్రహం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి విగ్రహాని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైద్యధికారి డా.శోభారాణి, పల్నాడు జిల్లా ఎన్‌కాస్ అసోసియేట్ డా.రాంప్రసాద్, గుంటూరు జిల్లా ఎన్‌కాస్ అధికారి డా.శివ తేజ, ముప్పాళ్ళ పీహెచ్‌సీ వైద్యులు రమాదేవి, జయకృష్ణప్రవీణ్, రొంపిచర్ల పీహెచ్‌సీ వైద్యధికారి స్వాతి, సీహెచ్‌ఓ ఆంజనేయులు, డీపీఎమ్ పాపారావు, సబ్‌యూనిట్ ఆఫీసర్ ప్రభాకరరెడ్డి, సూపర్‌వైజర్‌లు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



ముప్పాళ్ళ పీహెచ్‌సీలో మలేరియా యూనిట్ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిస్తున్న బృందం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన చిట్యాల నాగార్జునరెడ్డి తన జన్మదినం సందర్భంగా ద్విచక్రవాహనంపై పురుషోత్తమపట్నంలో ఉన్న సాయిబాబా మందిరానికి వెళ్లి పూజలు నిర్వహించాడు. తిరుగు ప్రమాణంలో వినాయకుడి గుడి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన వృద్ధుడిని తప్పించబోయి వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ క్రమంలో అటుగా వెళుతున్న లారీ టైరు కిందకు ఎడమ కాలు వెళ్లింది. ఈ ప్రమాదంలో నాగార్జునరెడ్డి ఎడమకాలు విరిగింది. 108 సిబ్బంది బాధితుడిని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్‌స్టేషన్ల ఆధునికీకరణపై నేడు సమావేశం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని వినుకొండ, నరసరావుపేట ఆర్టీసీ బస్‌స్టేషన్లను పీపీపీ పద్ధతిలో ఆధునికీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా ప్రజారవాణాశాఖాధికారి ఎన్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం ఉదయం 11.30గంటలకు స్థానిక జిల్లా ప్రజారవాణాశాఖాధికారి కార్యాలయంలో వ్యాపార సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ఉత్సావంతులైన వ్యాపారులు పాల్గొని అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

20న వాహనాల వేలం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఉపయోగంలో లేని జీపును మిషన్ శోభకృత్ –2023లో భాగంగా ఈ నెల 20వ తేదీ ఉదయం 11గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. 40 సంవత్సరాల క్రితానికి చెందిన ఈ వాహనం ఉపయోగంలో లేదని తెలిపారు. ఆసక్తి దారులు వేలానికి ముందే వాహనాన్ని పరిశీలించుకోవచ్చని, వేలం అధికారి వద్ద రూ.వెయ్యి డిపాజిట్ చేయాలని, గెలుపొందిన తరువాత డిపాజిట్ వాపస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పాట దక్కించుకున్న వ్యక్తి వాహన చట్టం కింద వాహనం రిజిస్ట్రేషన్‌కు అయ్యే అన్ని ఖర్చులు భరించాలని, వారి నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.